

మైసిగండి ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్

కడ్తాల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ శివరామాలయ దేవాలయ ట్రస్టు బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేవాదాయ శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్ ఇచ్చిన ఆదేశాలను అనుసరించి ట్రస్టు బోర్డు ఏర్పాటుకు ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం ట్రస్టు బోర్డు ఏర్పాటుకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ నోటిఫికేషన్‌ను పలు చోట్ల కార్యాలయాల వద్ద ఆలయ అధికారులు ప్రదర్శించారు. దేవాదాయ శాఖ కమిషర్, అసిస్టెంట్ కమిషనర్‌లకు 20 రోజుల్లో దరఖాస్తులు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



జేపీ దర్గాలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మాజీ చైర్మన్ మసిఉల్లాఖాన్ ప్రార్థనలు

ముస్లింల అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్న ప్రభుత్వం

- ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

కొత్తూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముస్లింల అభివృద్ధిని, అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసం చేస్తుందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో ఉన్న హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గాలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ మసిఉల్లాఖాన్ నియాజ్ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్, మాజీ హోంమంత్రి కుమారుడు ఆజంఅలీ కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో హిందూ, ముస్లింలు కలిసి మెలిసి ఉండేవారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింలపై దాడులు జరుతున్నాయని ఆరోపించారు. మైనార్టీ డిక్లరేషన్ ప్రకటించి వారికి మొండి చెయ్యి చూపారని పేర్కొన్నారు. అలాగే ముస్లీం రెసిడెన్షియల్ కళాశాలలను మూత వేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మైనార్టీలు తగిన గుణపాఠం నేర్పుతారని, బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ మసిఉల్లాఖాన్‌లు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం జేపీ దర్గాను మాస్టర్‌ప్లాన్ ద్వారా అభివృద్ధి చేసేందుకు 50కోట్ల రుపాయలు మంజూరు చేసిందని, దాన్ని అమలుపర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ రాష్ట్ర విభాగం నాయకుడు బద్రోద్దిన్, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు మెండె కృష్ణయాదవ్, నాయకులు కడెంపల్లి శ్రీనివాస్, పెంటనోళ్ల యాదగిరి, తస్లీం, గోపాల్‌నాయక్, ఇంద్రాసేనారెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి ఉష

మాడ్గుల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పత్తి చేనులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉష సూచించారు. రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడాలని సూచించారు. మాడ్గుల మండలంలోని ఇర్విన్, గిరి కొత్తపల్లి, రామ్‌దుగ్యాల, నల్లచెర్వు గ్రామాలలో పత్తి పంటలను పరిశీలించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు నమోదు చేస్తున్న పంటల వివరాల నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో అరుణకుమారి, జ్యోత్స్న, యాదయ్య పాల్గొన్నారు.



మద్యం దుకాణాల కేటాయింపు, షెడ్యూల్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 249 మద్యం దుకాణాలకు శుక్రవారం నుంచి అక్టోబర్ 18 వరకు ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. అక్టోబరు 23న లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయించనున్నారు. రెండేళ్ల కాలానికి (2025 డిసెబర్ 1 నుంచి 2027 నవంబరు 30 వరకు) అనుమతులతో ఎక్సైజ్‌శాఖ కొత్త లైసెన్సులు జారీ చేయనుంది. కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తు రుసుం రూ.3 లక్షలుగా నిర్ధారించారు.

కొత్త కిక్కు!

- జిల్లాలో 249 షాపులకు నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- అక్టోబరు 23న డ్రా. దుకాణాల కేటాయింపు
- ఒక్కోదరఖాస్తుకు రూ. 3 లక్షలు
- మద్యం టెండర్లలో ఎస్సీ ఎస్టీ, గౌడలకు రిజర్వేషన్లు అమలు

నూతన మద్యం పాలసీ ప్రక్రియ షురూ



రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా మద్యం దుకాణాలు పొందాలనుకునేవారి కోసం ప్రభుత్వం నిబంధనలు తీసుకొచ్చింది. ఎక్సైజ్ చట్టం 1968 ప్రకారం శిక్ష పడిన వారు, ప్రభుత్వానికి బకాయిలు పడి సక్రమంగా చెల్లింపు చేయనివారు దుకాణాలు పొందేందుకు అనర్హులు. దుకాణాల కేటాయింపులో ప్రభుత్వం ఈసారి టెండర్ ఫీజులో మార్పు చేసింది. గతంలో రూ.2 లక్షలుగా ఉన్న ఫీజును రూ.3 లక్షలకు పెంచి నిర్ణయించింది. ప్రస్తుతం అమలులో ఉన్న దుకాణాల లైసెన్స్ గడువు నవంబర్ 30తో ముగియనుంది. దాంతో కొత్త దరఖాస్తుల ప్రక్రియ మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ లైసెన్స్ పొందటంలో కొన్ని అర్హతల నిబంధనలను ప్రభుత్వం స్పష్టంగా తెలిపింది. 1968 ఎక్సైజ్ చట్టం ప్రకారం శిక్షపడిన వ్యక్తులు అర్హులు కారని నిబంధనలో పేర్కొంది. ఎస్సీ ఎస్టీలు, గీతా కార్మికులను రిజర్వేషన్లు కేటాయించారు. రంగారెడ్డి జిల్లాలో సరూర్‌నగర్, శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు ఉండగా మొత్తం 249 మద్యం దుకాణాలు ఉన్నాయి. శంషాబాద్ పరిధిలో 111 మద్యం షాపులు

మిగతా 8వ పేజీలో...



స్వీట్లు తినిపించుకుంటున్న మాజీ చైర్మన్లు

అధర్మంపై ధర్మం గెలిచింది

కందుకూరు, మహేశ్వరం సహకార సంఘాల మాజీ చైర్మన్లు

కందుకూరు/మహేశ్వరం, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): అధర్మంపై ధర్మం గెలిచిందని కందుకూరు, మహేశ్వరం మండలాల మాజీ చైర్మన్లు డి.చంద్రశేఖర్, ఎం.పాండు యాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘం పాత చైర్మన్లను తొలగించడానికి మంజూరు చేసిన 639/2025జీవోపై రెండు మండలాల పాత పాలక వర్గం హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. దీంతో గురువారం హైకోర్టు ఆ జీవోపై గురువారం స్టే విధించడంతో ఇద్దరు మాజీ చైర్మన్లు మిఠాయిలను తినిపించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజాస్వామ్యంతో ఎన్నుకున్న తమను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డదారిగా జీవోను తీసుకువచ్చి తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. తమ కాలపరిమితి ముగిసిన వెంటనే ప్రభుత్వం నూతనంగా ఎన్నికలు నిర్వహించడానికి నిర్లక్ష్యం చేస్తూనే..... ఉన్న పాలకవర్గానికి ఎలాంటి సమాచారం లేకుండా వారికి అనుకూలంగా ఉన్న డైరక్టర్లలో ఒకరిని చైర్మన్లుగా నియమించడం దారుణమన్నారు. రైతుల సంక్షేమానికి ఏడేళ్ల పాటు పాలకవర్గం సభ్యులతో కలిసి కృషి చేశామన్నారు. దీంతో తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో డబ్ల్యూపీ నంబర్ 28572ఆఫ్ 2025పై స్టే ఇవ్వడం పట్ల ప్రభుత్వం చేస్తున్న ద్వంద్వ విధానాలపై మొట్టికాయ వేసినట్లుగా అయ్యిందన్నారు. ఇది రైతుల విజయమని వారు పేర్కొన్నారు.



కాత్యాయిని దేవిగా దుర్గామాత

మహేశ్వరం మండల కేంద్రంలోని శ్రీ రాజ రాజేశ్వరాలయంలో దసరా శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం అమ్మవారు కాత్యాయిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ తరదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రుమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, మోదిని రాఖేష్, నరేష్, శంకర్, తిరుపతయ్య, సాయిలు, శ్రీశైలం, సువర్ణ పాల్గొన్నారు.

మహేశ్వరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి)





ప్రకృతి పండగ బతుకమ్మ : డీఆర్వో సంగీత

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతిలో లభించే పూలతో దేవతను చేసి పూజించే వేడుక బతుకమ్మ పండుగ అని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ శాఖ, సివిల్ సప్లయ్ ఇతర శాఖలు నిర్వహించిన బతుకమ్మ వేడుకలో ఆమె పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వనజాత, రెవెన్యూ సిబ్బంది, ఇతర శాఖల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



విజయ డెయిరీ పార్లర్‌ను ప్రారంభిస్తున్న అమిత్‌రెడ్డి

రాష్ట్ర వ్యాప్తంగా 400 విజయ డెయిరీ పార్లర్లు

- సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి
- కొందుర్గులో మొదటి పార్లర్ ప్రారంభోత్సవం

కొందుర్గు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీని మరింత విస్తృతపర్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 400 డెయిరీ పార్లర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి వెల్లడించారు. గురువారం రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలో యువకుడు మల్లేష్ ఏర్పాటు చేసిన తొలి విజయ డెయిరీ పార్లర్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాడీ రైతులకు మంచి లాభాలు చేకూర్చేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని తెలిపారు. వినియోగదారులు కూడా విజయ పాలను కొనుగోలు చేసి పాడి రైతులకు అండగా ఉండాలని కోరారు. నాణ్యమైన పాలను కొనుగోలు చేసి అంతర్జాతీయ ప్రమాణాలున్న పోషక విలువలతో విక్రయిస్తున్నామని చెప్పారు. గతంలో కంటే పాల నాణ్యత పెరగడంతో వినియోగదారులు కూడా విజయా పాలను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థ అయిన విజయ డెయిరీని గత ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిందని ఆరోపించారు. సేకరించిన పాలకు బిల్లులు చెల్లించకుండా పాడి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి బకాయి బిల్లులను చెల్లించడంతో పాటు, విజయా డెయిరీని మరింత అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు రవీందర్, జితేందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, కృష్ణయ్య, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ శంకర్‌పల్లి అభివృద్ధికి సహకరించాలి

- శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేశ్



చిల్డ్రన్ పార్కును శుభ్రపరుస్తున్న యోగేష్, నాయకులు

శంకర్‌పల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ శంకర్‌పల్లి అభివృద్ధికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ యోగేశ్ కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 'ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాథ్' అనే నినాదంతో గురువారం మున్సిపల్ పరిధిలోని చిల్డ్రన్ పార్కులో మాస్ క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించి మొక్కలు నాటారు. నారాయణ స్కూల్ వద్ద చీపురుతో చెత్తాచెదారాన్ని ఊడ్చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలు, వీధులు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపల్ బండ్లలోనే వేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, మాజీ కౌన్సిలర్ చంద్రమౌళి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సర్తాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రవీన్‌కుమార్, అశోక్‌కుమార్ ఉన్నారు.

మీ చెంతకే భవిష్య నిధి

- 29న అవగాహన శిబిరాలు
- పీఎఫ్ సమస్యల పరిష్కారానికి సదవకాశం



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : ఉద్యోగులు, ఆయా సంస్థల యజమానులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఈనెల 29న 'మీ చెంతకే భవిష్య నిధి' (నిధి ఆప్కే నికత్- 2.0) అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. వివిధ సంస్థలు, పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, యజమానులకు 'భవిష్య నిధి' (పీఎఫ్) సమస్యలపై అవగాహన పెంపొందించేందుకు పలు ప్రాంతాల్లో అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి, హైదరాబాద్-2 ప్రాంతీయ కార్యాలయం సహాయ భవిష్య నిధి కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా చేపట్టిన ప్రచార కార్యక్రమాల్లో భాగంగా జిల్లా స్థాయిలో ఈ అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నామని, వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రంగారెడ్డి ప్రాంతీయ కార్యాలయ పరిధిలోకి వచ్చే ఎనిమిది జిల్లాలకు సంబంధించి ఎనిమిది ప్రదేశాల్లో నిధి ఆప్కే నికత్ 2.0 (నాన్) కార్యక్రమాన్ని ఈనెల 29వ తేదీన ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5-45 గంటల వరకు నిర్వహించనున్నారు. రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, గద్వాల్, వనపర్తి జిల్లాలకు చెందిన వారు ఈ కింద సూచించిన శిబిరాలకు హాజరై పీఎఫ్ సమస్యలను పరిష్కరించుకోవాలని, అనుమానాలను నివృత్తి చేసుకోవాలని అధికారులు సూచించారు.

జిల్లాల వారీగా అవగాహన శిబిరాలు

జిల్లా	అవగాహన శిబిరం జరిగే ప్రాంతం
రంగారెడ్డి	సైంట్ లిమిటెడ్, ప్లాట్ నంబరు 11 ఇన్ఫోసిటీ, సాఫ్ట్‌వేర్ లేఅవుట్, హైటెక్, మాదాపూర్
హైదరాబాద్	ఓషన్ పార్కు, గండిపేట
వికారాబాద్	ఎంకార్ ప్యాకేజింగ్ ప్రై.లిమిటెడ్, దామరగిద్ద, చేవెళ్ల మండలం
మహబూబ్‌నగర్	జయప్రకాష్ నారాయణ కాలేజీ, రాయచూర్ రోడ్డు, మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్	ఎస్ఎల్‌బీహెచ్‌ఈపీ, టీజీ జెన్‌కో, శ్రీశైలం నాగర్‌కర్నూల్
నారాయణపేట	డీఆర్‌డీఓ కార్యాలయం, నారాయణపేట
గద్వాల్	శారద హైస్కూల్, గద్వాల్
వనపర్తి	గాయత్రీ బీఎడ్ కాలేజీ, గోపాల్‌పేట రోడ్, వనపర్తి

దీన్‌దయాల్ ఉపాధ్యాయ సేవలు
చిరస్మరణీయం
చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి 7

ప్రజాపాలనలో
రైతులకు భరోసా
ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి 7

దశలవారీగా
గ్రామాల అభివృద్ధి
ఎమ్మెల్యే కాలె యాదయ్య 7

తెలంగాణ ఉపాధ్యాయుల ప్రదర్శనలు అదుర్స్

షాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లో జరిగే పదిరోజుల శిక్షణా కార్యక్రమానికి (ఇంటిగ్రేటెడ్ క్రాఫ్ట్ స్కిల్స్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్ న్యూ ఎడ్యుకేషన్ పాలసీ-2020 అనే అంశంపై) తెలంగాణ నుంచి 9 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాల ప్రదర్శనలిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణలో జరిగే బోనాలు, బతుకమ్మ పండుగలను కళ్లకు కట్టినట్లు చూపించారు. ఉపాధ్యాయులు వివిధ వేషధారణలో ఆకట్టుకున్నారు. దీనికి సీసీఆర్‌టీ డైరెక్టర్ తెలంగాణ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. షాబాద్ మండలం వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాలకు చెందిన సింహాద్రినాయుడు పోతురాజు వేషధారణలో అలరించాడు. అదేవిధంగా వివిధ జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, శ్రీనివాసులు, రవి, రాజు, శ్రీనివాస్‌గౌడ్, హరికోటి, మణిదీపిక పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి.. గ్రూప్1 ఉద్యోగాలు సాధించి

● ఫలితాల్లో మెరిసిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు



వర్షిత · తుప్పలి మౌనిక · మారుతియాదవ్ · జయకృష్ణ · సస్యరెడ్డి

ధారూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): టీజీ పీఎస్సీ బుధవారం ప్రకటించిన గ్రూప్1 తుది ఫలితాల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు. ధారూరు మండలం నాగారానికి చెందిన టీచర్లు నరేందర్‌రెడ్డి-నవనీత దంపతుల కూతురు వర్షిత గ్రూప్-1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికైంది. ప్రస్తుతం వర్షిత యాదాద్రి-భువనగిరి జిల్లా నారాయణ్‌పూర్ మండల వ్యవసాయాధికారిగా పనిచేస్తున్నారు. ఆమె టెన్త్ వరకు వికారాబాద్‌లో చదివారు. ఇంటర్ హైదరాబాద్‌లో, రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఎంఎస్సీ చేసి ఏవో ఉద్యోగం సాధించారు.

కులకచర్ల: కులకచర్లకు చెందిన తుప్పలి మౌనిక జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారిగా.. తిరుమలాపూర్‌నకు చెందిన మారుతియాదవ్ మున్సిపల్ అధికారిగా గురువారం ఉత్తర్వులు అందుకున్నారు.

మహేశ్వరం: గ్రూప్1లో 378వ ర్యాంక్‌తో తుమ్మలూరుకు చెందిన జయకృష్ణ అసిస్టెంట్ ట్రెజరీ అధికారి (ఏటీవో)గా ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ.. ఎప్పటికైనా సివిల్స్ సాధించి కలెక్టర్ కావాలన్నదే తమ ఆశయం అన్నారు.

కోట్‌పల్లి: మోత్కుపల్లికి చెందిన కెరెల్లి సస్యరెడ్డి గ్రూప్1లో 347వ ర్యాంక్ సాధించింది. తండ్రి వెంకట్‌రెడ్డి ప్రోత్సాహంతో మొదటి అటెంప్ట్‌లోనే 462.5 మార్కులు సాధించింది. సస్యరెడ్డిని ప్రభుత్వం కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా నియమించింది. సస్య విద్యాభ్యాసం హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ నగరాల్లో సాగింది.



ధనసిరి దివ్య

మర్పల్లి: తుమ్మలపల్లికి చెందిన ధనసిరి దివ్య అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉద్యోగం సాధించారు. ఆమె తల్లి రాణి గృహిణి. తండ్రి ప్రకాశ్ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ఎంవీ ఫౌండేషన్ ద్వారా సేవలందిస్తున్నారు. దివ్య పాఠశాల విద్య లింగంపల్లి జ్యోతినగర్‌లో, ఇంటర్ హైదరాబాద్‌లో పూర్తి చేశారు. కోఠి మహిళా కాలేజీలో బీఎస్సీ(ఎంపీసీ) చేశారు. తొలిసారి గ్రూప్స్‌లో ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. సీడీపీవో పరీక్షలో ఉద్యోగానికి ఎంపికయ్యారు. గ్రూప్-1లో 230వ ర్యాంక్‌తో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఎంపికై గురువారం ఎక్సైజ్ కమిషనరేట్‌లో రిపోర్ట్ చేశారు.

మెడిసిన్ సీటు సాధించిన విద్యార్థినులు



సాయిదీపికకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఆమనగల్లు/చౌడాపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నీట్‌లో ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థినులు మెడిసిన్‌లో సీటు సాధించారు. ఆమనగల్లుకు చెందిన పెరికేటి యాదయ్య-సుజాత దంపతుల కుమార్తె సాయిదీపిక సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. గురువారం సాయిదీపికను ఆమనగల్లులో తల్లిదండ్రులతో పాటు స్థానికులు అభినందించారు. చౌడాపూర్ మండలం చాకల్‌పల్లికి చెందిన పటేల్ సుదర్శన్ కూతురు స్వప్న నీట్‌లో 434 మార్కులతో కన్వీనర్ కోటాలో సిద్దిపేట జిల్లాలోని ఆర్‌వీఎం మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. రైతు కుటుంబానికి చెందిన స్వప్న ఎంబీబీఎస్ సీటు సాధించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణకు జమ్మి చెట్టుతో ఉన్న బంధం విడదీయలేనిది

మహేశ్వరం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలైన బతుకమ్మ, బోనాలకు ఎంత ప్రాధాన్యం ఉందో జమ్మిచెట్టుకు కూడా అంతే ప్రాముఖ్యత ఉందని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. గురువారం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిరాల జెన్నాయిగూడ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో జమ్మి మొక్కను నాటారు. ఆమె మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో పదేళ్ల సుభిక్షంగా ఉన్న రాష్ట్రం ఇప్పుడున్న కాంగ్రెస్ పాలనతో అభివృద్ధిలో వెనకపడిపోయిందన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కాంగ్రెస్ నాయకులు గాలికొదిలేశారన్నారు. తెలంగాణలో దసరా పండుగ వచ్చిందంటే పాలపిట్ట, జమ్మిచెట్టు తెలియని వారంటూ ఉండరన్నారు. ఎంతో కాలంగా కలుసుకోని వారిని కూడా దసరా రోజు జమ్మి ఆకులు కలుపుతాయన్నారు. అంతటి ప్రాముఖ్యం గల జమ్మి చెట్టును కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, సప్పిడి రాజు, రత్నం, సురేష్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో జమ్మి చెట్టును నాటుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

● జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు
● మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులకు నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలను అందజేస్తున్న డీఎంహెచ్‌వో

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న బస్తీ దవాఖానాల్లో వైద్య సిబ్బంది పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఏడాది కాలపరిమితితో కాంట్రాక్టు పద్ధతిన పోస్టులను భర్తీ చేస్తుంది. 75 మెడికల్ ఆఫీసర్ల పోస్టులు మంజూరు కాగా ఇప్పటికే 68ఖాళీలను భర్తీచేశారు. గురువారం మరో ఏడు పోస్టులను ఫిలప్ చేశారు. వారికి నియామక పత్రాలను డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు అందించారు. అలాగే 75 స్టాఫ్‌నర్స్ పోస్టులు మంజూరు కాగా 72 పోస్టులను గతంలో భర్తీ చేయగా మిగిలిన మూడు స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలను అందించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిపాలన అధికారి మహమ్మద్ షఫియొద్దీన్, డీపీవో అక్రం, మాస్ మీడియా అధికారి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

బలహీనంగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారం అందజేయాలి



పోషణ మాసం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో పోషకాహార లోపంతో ఉన్న పిల్లలను గుర్తించి వారికి సరైన పోషకాహారాన్ని అందజేయాలని జిల్లా శిశుసంక్షేమాధికారి శ్రీలత అన్నారు. పోషణ మాసం-2025 సందర్భంగా గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పోషణ మాసం కార్యక్రమంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు అవసరమైన ఆరోగ్య పరీక్షలు, పోషకాహార సూచనలు, పరిశుభ్రమైన నీరు, టీకాలు, వైద్య సలహాలు అందించడం ద్వారా ఆరోగ్యవంతులగా మార్చేందుకు అవకాశముందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ వొస్తేనే తెలంగాణ తల్లి చేతిలోకి బతుకమ్మ

● మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

కోట్‌పల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి చేతిలోకి బతుకమ్మ రావాలంటే మళ్లీ కేసీఆర్ రావాలని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. గురువారం మైటీ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఆయన మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం ఆనంద్ మాట్లాడుతూ.. బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. బతుకమ్మ పండుగ మనసులని కలిపే వేదిక, సమాజాన్ని ఆధ్యాత్మికతతో నింపి ఆరోగ్యంగా ఉంచే ఒక ప్రక్రియన్నారు. పూలు, ఆకులతో, అలంకరించిన, వలయంలో తిరుగుతూ, చప్పట్లు కొడుతూ, పాటలు పాడుతూ ప్రకృతి దేవతను ఆరాధించడం అనేది ప్రకృతిలో ఒక భాగమే అని చెప్పే గొప్ప సంస్కృతి అన్నారు. తెలంగాణ ప్రజల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగన్నారు. బతుకమ్మ పండుగకు ఇచ్చే చీరలకు ఇందిరమ్మ చీరలు అని పేరు పెట్టడం సరికాదన్నారు. కార్యక్రమం సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటేష్, ప్యాక్స్ చైర్మన్ రాంచందర్‌రెడ్డి, నాయకులు కొండల్‌రెడ్డి, దశరథ్‌గౌడ్, ఉమాదేవి, లక్ష్మణ్, ప్రవీణ్, లక్ష్మి, మల్లారెడ్డి, అరుణ్, సంతు, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై వేంకటేశుడు

వికారాబాద్: వికారాబాద్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి రజతోత్సవ బ్రహోత్సవాలు గురువారం నాలుగో రోజు ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు ఆయనను సన్మానించారు. సాయంత్రం స్వామి వారిని హంస వాహనంపై ఊరేగించి ఊయల సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణ, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

రైతులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మధుసూదన్‌రెడ్డితో పెదవేడు గ్రామస్తులు

షాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి):పెదవేడలో సర్వే నంబర్ 147లో భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గౌండ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డికి విన్నవించారు. దీనికి మధుసూదన్‌రెడ్డి స్పందిస్తూ.. అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు యాదయ్య, గ్రామస్తులు భాస్కర్, ప్రదీప్‌గౌడ్, కృష్ణాగౌడ్, కుమార్, విష్ణు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని అనురాగ్ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ మహిపతి శ్రీనివాస్‌రావు తెలిపారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో గురువారం ఎంసీఏ ఫస్టియర్ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను చేరుతారని తెలిపారు. కార్యక్రమంలో డీన్లు ముత్తారెడ్డి, నితిషా శర్మ, సుధీర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మేకగూడ పీఏసీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంజులారెడ్డి

రైతులకు అండగా సొసైటీ బ్యాంకులు

» మేకగూడ సహకార సంఘం చైర్‌పర్సన్ మంజులారెడ్డి

నందిగామ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా ప్రాథమిక సహకార సంఘాల బ్యాంకులున్నాయని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మేకగూడ ప్యాక్స్ చైర్‌పర్సన్ మంజులారెడ్డి అన్నారు. మేకగూడ పీఏసీఎస్‌లో గురువారం మంజులారెడ్డి అధ్యక్షతన మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాము ఎల్లవేళలా రైతులకు అండగా ఉంటామని, అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. యూరియా కొరతను అధిగమించి రైతులకు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మేకగూడ సొసైటీ ద్వారా ద్వారా ఇప్పటి వరకు రైతులకు రూ.13కోట్ల రుణాలు ఇచ్చామని మంజులారెడ్డి తెలిపారు. సొసైటీ 1.34కోట్ల లాభాల్లో ఉందని చెప్పారు. సహకార సంఘ వార్షిక లావాదేవీలను రైతులకు వివరించారు. రైతులకు రూ.50లక్షల విలువైన రుణాల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్యాక్స్ సీఈవోలు బాల్‌రాజ్, యాదయ్య, డైరెక్టర్లు యెన్నం బల్వంతరెడ్డి, అజయ్, శంకరయ్య, జంగయ్య, తౌర్య, యాదయ్య, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాన లహరి



గాన కచేరి నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యం

ఆమనగల్లు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని భక్త మార్కండేయ ఆలయంలో గురువారం సంగీత విద్వాంసుడు, నంది అవార్డీ డాక్టర్ దీక్షితుల సుబ్రహ్మణ్యం నిర్వహించిన భక్త గాన లహరి ఆహూతులను అలరించింది. ప్రవచనాలు, భక్తి పాటలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. సుబ్రహ్మణ్యాన్ని ఆలయ నిర్వాహకులు సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఎంగిలి బాలకృష్ణ, నాయకులు అప్పం శ్రీను, శివలింగం, సత్యారాములు, రవి, మహేశ్, అలివేలు, దుర్గయ్య, గాజుల శ్రీను, మస్న గిరి, మురళీధర్, శ్రీధర్, రాఘవ, నారాయణ, వాసు, శివకుమార్, నిరంజన్, తిరపతయ్య, బద్రయ్య, జి.ప్రవీణ్, భాస్కర్, చంద్రయ్య, శంకర్, జగదీశ్, శివ పాల్గొన్నారు.

కీర్తి పురస్కార్ అవార్డు గ్రహీతకు సన్మానం



కవి చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

తాండూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో కీర్తి పురస్కారాన్ని అందుకున్న తాండూరుకు చెందిన ప్రముఖ కవి కోటం చంద్రశేఖర్‌ను పలు వేదికలు, సంస్థలు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డీ గాజుల బస్వరాజ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు బాలకృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు శరణప్ప, మణిపూసల రూపకర్త వడిచర్ల సత్యం, కవియిత్రి కళా వేదిక ఫౌండేషన్ అధ్యక్షుడు కేపీఎం వెంకట్ మాట్లాడారు. చంద్రశేఖర్ కవిత్వం సమాజానికి, ఆత్మీయతను మార్గదర్శకత్వాన్ని పంచుతోందని అన్నారు.

దేశ నిర్మాణమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం



విజయదశమి ఉత్సవంలో మాట్లాడుతున్న శివశంకర్ జీ

ఆమనగల్లు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణానికి పాటుపడడమే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ లక్ష్యం అని ఆర్ఎస్ఎస్ ప్రాంతీయ సేవా ప్రముఖ్ శివశంకర్‌జీ అన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్థాపనోత్సవాల్లో భాగంగా మంగళపల్లిలో గురువారం రాత్రి విజయదశమి ఉత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి శివశంకర్‌జీ మాట్లాడారు. 1925లో ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ నేడు విస్తృత శాఖలతో, హిందుత్వ ఆధార సంస్థలతో అనేక దేశాల్లో పని చేస్తోందన్నారు. సామాజిక సామరస్యత, కుటుంబ జీవన విలువలు, స్వ ఆధారిత జీవనం, పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరు పాటించాలన్నారు. కార్యక్రమంలో చుక్క ఆనంద్, ఖండ్ కార్యవాహ ఎరగమోని రామకృష్ణ, ముఖ్య శిక్షక్ రవేలు శ్రీనివాస్, వరికుప్పల శ్రీనివాస్, రాఘవేందర్, శ్రీశైలం, శివ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ కలశాన్ని ప్రతిష్ఠిస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సింహులు

భక్తిశ్రద్ధలతో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడలో నిర్మించిన ఆలయంలో హనుమాన్ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠ చేశారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి పూజా కార్యక్రమాలను నిర్వహించి, గురువారం విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గర్భగుడిపై కలశ ప్రతిష్ఠ అనంతరం గర్భగుడిలో హనుమాన్ విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిష్వ కిష్టయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

జనాభా జాబితాను ప్రదర్శించాలి

» బీసీ, ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పల్నాటి నరేశ్

మహేశ్వరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అన్ని గ్రామాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జనాభాకు సంబంధించిన జాబితాను ప్రదర్శించాలని ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పల్నాటి నరేశ్ అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన కాకుండా కొందరు రాజకీయ పలుకుబడి ఉన్న నేతలకు అనుకూలంగా రిజర్వేషన్లు వెల్లడిస్తున్నారనే ప్రచారం జరుగుతుందని, అలా చేస్తే ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆందోళనలు చేయక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటేష్, శ్రీకాంత్, సాయికిరణ్ పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న పల్నాటి నరేశ్

దశలవారీగా గ్రామాల అభివృద్ధి

» ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం నుంచి భారీగా నిధులు తీసుకొస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. గురువారం మండల పరిధిలోని దేవరంపల్లి, నాన్‌చెర్వు, ఖానాపూర్, ఆలూర్, అంతారం, హస్తేపూర్ తల్లారం, కౌకుంట్ల, తంగడ్‌పల్లి, మడికట్టు, కమ్మెట, కిష్టాపూర్ తదితర గ్రామాల్లో హెచ్ఎండీఏ నిధులు రూ.3.85 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణం, వీధిలైట్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ ఇంత పెద్దమొత్తంలో నిధులు హెచ్ఎండీఏ నుంచి రాలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గ్రామాల అభివృద్ధికి భారీగా నిధులు వస్తున్నాయన్నారు. కొత్తగా శంకుస్థాపన చేసిన పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, నక్క బుచ్చిరెడ్డి, పీఆర్ డీఈ గణేశ్, ఏఈ ప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, డి. గోపాల్‌రెడ్డి, రాజశేఖర్, అనంతరాములుగౌడ్, పాండరీగౌడ్, సుందేందర్, నర్సింలు, తులసీరాజు మార్కెట్ చైర్మన్ పెంటయ్యగౌడ్, వీరందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పాండుయాదవ్, యాదిరెడ్డి, నరేందర్, మాణిక్యం, కార్తీక్‌రెడ్డి, నర్సింలు, కాలె శ్రీకాంత్ ఉన్నారు.



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేదెవరు?

» మహంతీపూర్ వాగు నుంచి జోరుగా తరలింపు

బొంరాస్‌పేట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట మండలం నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులను అడిగితే ప్రభుత్వ పనుల కోసం తరలిస్తున్నారని తప్పించుకుంటున్నారు. తహసీల్దార్‌ను అడిగితే ఎవరికీ అనుమతి ఇవ్వలేదని చెబుతున్నారు. మహంతీపూర్ వాగు నుంచి రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. మహంతీపూర్ వాగులో గత సంవత్సరం నుంచి యథేచ్ఛగా ఇసుక రవాణా జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు. గ్రామానికి నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న యాలాల్ మండలం నుంచి ఇసుక రవాణాను అరికట్టేందుకు పోలీసులు రాత్రిళ్లు దాడులు నిర్వహిస్తోంటే.. బొంరాస్‌పేట్ మండల పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గురువారం మహంతీపూర్ నుంచి 15ట్రాక్టర్లతో రోజంతా ఇసుకను బొంరాస్‌పేట్ మీదుగా నాగిరెడ్డిపల్లి, కొడంగల్ వైపు తరలించినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ విషయమై తహసీల్దార్ పద్మావతి స్పందిస్తూ.. ఇసుక రవాణాకు తాను ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని తేల్చి చెప్పారు.



మహంతీపూర్ వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

యాలాల ప్యాక్స్‌లో ఆడిట్

ఖర్చుపై చైర్‌పర్సన్, సీఈవోల స్టేట్‌మెంట్ రికార్డు

వారం రోజుల్లో కలెక్టర్‌కు నివేదిస్తామన్న విచారణాధికారులు

డబ్బు తీసుకొని పత్తాలేని కాంట్రాక్టర్‌పై పోలీసులకు చైర్మన్ ఫిర్యాదు

తాండూరు, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): యాలాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం రైస్ మిల్లు మిషనరీ కొనుగోలుకు కాంట్రాక్టర్‌కు అడ్వాన్స్ చెల్లింపు ఘటనపై విచారణ చేయాలని కలెక్టర్.. డీసీవోను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై ఆంధ్రజ్యోతిలో 'మిల్లు కట్టకున్న బిల్లు' అనే శీర్షికన ఈ నెల 21న కథనం ప్రచురితమైంది. దీంతో సొసైటీకి చెందిన రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం జిల్లా సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ కవిత, సీనియర్ ఇన్‌స్పెక్టర్ అజ్మల్ ఆడిట్ అధికారులుగా విచారణ జరిపారు. విచారణానంతరం చైర్మన్, సీఈవోల వివరణ తర్వాత నివేదిక డీసీవోకు అందజేస్తామని వారు తెలిపారు. విచారణకు వారం రోజులు పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. మిషనరీ కొనుగోలుకు కాంట్రాక్టర్‌కు చెక్కుల చెల్లింపుల్లో ఏమైనా అవకతవకలు జరిగాయా? నిబంధనలు పాటించారా? అన్నదానిపై విచారణ చేస్తున్నామని తెలిపారు. అయితే సొసైటీ గోదాం నిర్మాణం, మిషనరీ కొనుగోళ్లకు సంబంధించి ఎప్పటికప్పుడు త్రీ మెన్ కమిటీ పరిశీలించాలి. ఈ కమిటీలో సొసైటీ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్, ఓ అధికారి సభ్యులు. చేసిన పనులపై వీరు ఇంజినీరింగ్ అధికారులకు నివేదిక ఇవ్వాలి. అధికారుల ఎంబీ రికార్డు అనంతరం డీజీఎం పరిశీలించి సొసైటీ తీర్మానం మేరకు బిల్లులు మంజూరు చేస్తారు. అయితే ఇక్కడంతా ఏకపక్షంగా జరిగింది. అడ్వాన్స్ తీసుకొని పత్తా లేని కాంట్రాక్టర్‌పై సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ఇలాంటి ఘటనలే వికారాబాద్ జిల్లాలో వివిధ గోదాలం నిర్మాణాల్లో చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. యాలాలలో పరికరాల కొనుగోలుకు డీజీఎం కంపెనీ పేరిట రిలీజింగ్ ఆర్డర్లిస్తే.. సొసైటీ పాలకవర్గం మాత్రం కాంట్రాక్టర్‌కు వ్యక్తిగతంగా డబ్బులు చెల్లించడం విమర్శలకు తావిస్తోంది.



రైతులకు సంఘీభావం తెలుపుతున్న గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి

ప్రభుత్వం స్పందించే వరకూ పోరాటం

కడ్తాల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సాగు చేసుకుంటూ జీవనం పొందుతున్న పంట పొలాల మీదుగా నిర్మిస్తున్న 765హై టెన్షన్ విద్యుత్ టవర్ల నిర్మాణ పనులు నిలిపేసి, అలైన్మెంట్ మార్చే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని రైతులు అన్నారు. కడ్తాలలో హైటెన్షన్ లైన్ భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 18వ రోజుకుచేరాయి. రైతులకు సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కడారి రామకృష్ణ, వివిధ పార్టీల నాయకులు సంఘీబావం తెలిపారు. నిర్వాసితులు, నాయకులు అభిషేక్‌రెడ్డి, పెంటారెడ్డి, పర్వత్‌కుమార్, వెంకటేశ్, శ్రీరాములు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా హైటెన్షన్‌లైన్ వేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం పేద రైతుల పొట్టకొట్టి పెట్టుబడిదారులకు భూమి అప్పగిస్తోందని వాపోయారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్.మహేశ్, గోరటి కృష్ణ, రాములుయాదవ్ పాల్గొన్నారు.



దీన్ దయాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

దీన్‌దయాల్ ఉపాధ్యాయ సేవలు చిరస్మరణీయం

» చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జన సంఘ వ్యవస్థాపకులు దీన్ దయాల్ ఉపాధ్యాయ సేవలు చిరస్మరణీయమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం చేవెళ్లలోని దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీన్ దయాల్ ఉపాధ్యాయ చేసిన సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. దేశాభివృద్ధికి ఆయన చూపిన మార్గాన్ని అనుసరిస్తామని చెప్పారు. అనంతరం పుష్కరిణి వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, కుంచం శ్రీనివాస్ గుప్తా, వెంకట్‌రాంరెడ్డి, శ్రీనివాస్, మధుకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, కృష్ణరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నాగరాజు, జయసింహరెడ్డి ఉన్నారు.

పైపుల పరిశ్రమపై దాడులు

» రూ.3లక్షల విలువైన ఉత్పత్తుల జప్తు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసార్ మండలం రాంపల్లిలోని పాలిథిలిన్ పైపుల పరిశ్రమపై గురువారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) హైదరాబాద్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. బీఐఎస్ ధ్రువీకరణ పొందని పాలిథిలిన్ పైపులను గుర్తించారు. రూ.3లక్షల విలువైన 2,485 ఉత్పత్తులను సీజ్ చేశారు. ఐఎస్ఐ మార్క్ లేని, నకిలీ ఐఎస్ఐ ముద్ర ఉన్న ఉత్పత్తులను జప్తు చేశామని, వీటిలో 32, 40, 75ఎంఎం పైపులు ఇతర వస్తువులు ఉన్నాయని, జప్తు కేసు నమోదు చేశామని అధికారులు వెల్లడించారు. బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ.శ్రీకాంత్ మాట్లాడుతూ.. బీఐఎస్ అనుమతి లేకుండా వస్తువుల తయారీ, విక్రయాలు, నిల్వ చేసినా నేరం అని తెలిపారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని వెల్లడించారు. భారతీయ ప్రమాణాలపై ప్రతీ వినియోగదారుడు అవగాహన కలిగి ఉండాలని, బీఐఎస్ కేర్ యాప్ ద్వారా వస్తువుల నాణ్యత ప్రమాణాలను గుర్తించాలన్నారు. నకిలీలను గుర్తిస్తే అదే యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ దాడుల్లో బీఐఎస్ హైదరాబాద్ శాఖ డైరెక్టర్ సుజాత తమ్మడి, డిప్యూటీ డైరెక్టర్ కెవిన్, ఉద్యోగులు పాల్గొన్నారు.



పాలిథిలిన్ పైపులతో బీఐఎస్ అధికారులు

నష్టాల్లోని సొసైటీని వృద్ధిలోకి తేవడం అభినందనీయం



శామీర్‌పేట సొసైటీని పరిశీలిస్తున్న అధికారులు, యూనివర్సిటీ విద్యార్థినులు

శామీర్‌పేట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నష్టాల్లో ఉన్న రైతు సహకార సంఘాన్ని చైర్మన్, డైరెక్టర్లు కృషిచేసి అభివృద్ధి పథంలోకి తీసుకరావడం గొప్ప విషయం అని రాష్ట్ర, జిల్లా సహకార శాఖ అధికారులు, సహకార యూనియన్ అధికారులు, మహిళా వర్సిటీ విద్యార్థినులు అన్నారు. గురువారం శామీర్‌పేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాన్ని అధికారులు, హైదరాబాద్ కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ విద్యార్థినులు సందర్శించారు. జిల్లా సహకారాధికారి వెంకట్‌రెడ్డి, సహకార యూనియన్ అధికారులు సురేఖవాణి, ప్రమీలరాణి, భార్గవి సొసైటీ పనితీరు బాగుందని కితాబిచ్చారు. సొసైటీ చైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో డైరెక్టర్లు బాధ్యతగా పనిచేస్తూ నష్టాల్లో ఉన్న శామీర్‌పేట సొసైటీని రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సొసైటీలో తీర్చిదిద్దారని ప్రశంసించారు. సంఘం ఆర్థిక లావాదేవీలు బాగున్నాయని కొనియాడారు. డైరెక్టర్ల సహకారంతో రైతులకు మెరుగైన సేవలందిస్తున్నామని చైర్మన్ వారికి వివరించారు. రైతులకు అవసరమైన మందులను, ఎరువులను, విత్తనాలను సరఫరా చేస్తున్నామని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అరెస్టు



మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు



దోమ పోలీస్‌స్టేషన్ వద్ద కొడంగల్, పరిగి మాజీ ఎమ్మెల్యేలు నరేందర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

కొడంగల్/దోమ/దుద్యాల/బొంరాస్‌పేట్/పూడూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో భాగంగా తొలగించిన కూల్చివేతలకు నిరసనగా తలపెట్టిన నిరసనకు వెళ్తున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. కొడంగల్ అభివృద్ధిలో భాగంగా రోడ్డుకు ఇరువైపుల ఉన్న ప్రార్థన మందిరాలను తొలగించడంతో గురువారం తలపెట్టిన నిరసనకు నరేందర్‌రెడ్డి కోస్గి నుంచి దుద్యాల మీదుగా కొడంగల్‌కు వెళ్తున్న క్రమంలో దుద్యాల స్టేజీ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని దోమ పీఎస్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి పరిగి పోలీస్‌స్టేషన్‌కు అక్కడి నుంచి చన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకులను సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచి వదిలిపెట్టారు. రోడ్డు విస్తరణలో చేపట్టిన కూల్చివేతలపై బీఆర్ఎస్ నిరసనకు పిలుపునివ్వడంతో పోలీసులు కొడంగల్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లో బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేసి స్టేషన్లకు తరలించారు. నాయకులు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయమని, గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రశ్నించిన వారిని అరెస్టులు చేయడం అప్రజాస్వామికం అన్నారు.

ప్రజాపాలనలో రైతులకు భరోసా


ప్రభుత్వ తోడ్పాటుతో పెరిగిన సాగు విస్తీర్ణం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా పాలనలో రైతులకు అన్నివిధాలా భరోసా ఏర్పడిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ప్రభుత్వ తోడ్పాటుతో రైతులు కష్టాల తొలిగి రాష్ట్రంలో సాగు విస్తీర్ణం, పంటల దిగుబడి పెరిగిందని ఆయన పేర్కొన్నారు. తలకొండపల్లి పీఏసీఎస్ గోదాం వద్ద గురువారం రైతులకు 100 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2250 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను 2500 మంది రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ యాట గీతనర్సింహ్మా, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి, ఏడీఏలు శోభారాణి, పద్మజ, ఏవో రేణుకచక్రవర్తి, యాట నర్సింహ్మా, మిట్టపల్లి అంజయ్య, డాక్టర్ శ్రీను, యాదయ్య, యాదగిరి, షాబొద్దీన్, జనార్దన్, శ్రీపాల్, నరేందర్, ఆరీఫ్, అజీజ్, మాజీ ఎంపీపీ ధనుంజయ్య, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఏఈవో శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

ఆమనగల్లు : దసరా పండుగను ప్రజలంతా శాంతియుతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కోరారు. జమ్మి, రావణాసురుడి వధ కార్యక్రమాల నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం దసరా పండుగ ఏర్పాట్లపై అఖిల పక్షంతో శాంతి సమావేశం నిర్వహించారు. పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. దసరా నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో ప్రత్యేక లైట్లను ఏర్పాటు చేయాలని, అంతర్గత రోడ్లను శుభ్రం చేయాలని కమిషనర్ శంకర్‌నాయక్‌కు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ్మా, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గగ్రం కేశవులు, ఎంపీడీవో మాధురి, మున్సిఫల్ కమీషనర్ శంకర్ నాయక్, ఎస్ఐ వెంకటేశ్, నాయకులు దుర్గయ్య, శ్రీకాంత్, నర్సింహ్మా, కృష్ణయాదవ్, చెన్నకేశవులు, లక్ష్మణ్, మండ్లీ రాములు, మానయ్య, జగన్, పత్యనాయక్, సాయిలు,శ్రీకాంత్, ఫరీద్, కాలే మల్లయ్య, అలీం, రామకృష్ణ, పత్యనాయక్, లక్ష్మణ్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

దుర్గాదేవి.. నమోస్తుతే

దసరా శరన్నవరాత్రోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. భక్తులు మండపాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కొన్నిచోట్ల అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు నాలుగో రోజు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు దుర్గాదేవిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



ఇబ్రహీంపట్నం టౌన్‌లో కాత్యాయనీదేవి అలంకారంలో దుర్గాదేవి



చేవెళ్ల మండలం కేసారంలో పూజలు



కొత్తూర్ : కాత్యాయనీ దేవిగా జై భవానీ సేవాసమితి ఆధ్వర్యంలో అలంకరించిన అమ్మవారు



షాబాద్ : దుర్గామాత ప్రత్యేక పూజలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఆయన సతీమణి కవిత



చేవెళ్ల : రచ్చబండ మండపం వద్ద సత్యసాయి పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



కడ్తాల : పూజల్లో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



ఆమనగల్లు : మార్కండేయ దేవాలయంలో పూజలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

అక్రమ అరెస్టులు సరికాదు

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులు సమంజసం కాదని సీఐటీయూ జిల్లా నాయకుడు నీరటి మల్లేశ్ అన్నారు. గురువారం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలపై చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ఆయన్ను ముందస్తు అరెస్టు చేశారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. అరెస్టయిన వారిలో సీఐటీయూ మండల నాయకుడు సామ్యేల్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను వేగంగా పూర్తిచేయాలి



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న కార్యదర్శి శివ, మాజీ సర్పంచ్ అంజయ్య

కేశంపేట/మాడ్గుల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి పనుల్లో వేగం పెంచాలని కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ బిజ్జారపు అంజయ్య సూచించారు. మండల పరిధిలోని సంతాపూర్‌లో గురువారం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కార్యదర్శి శివ, బీజేపీ జిల్లా సాంస్కృతిక శాఖ కో-కన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మిస్తే.. వెంటనే బిల్లు మంజూరవుతుందని ఆయన అన్నారు. కాగా, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాట్ల యాదయ్యగౌడ్ మాడ్గుల మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో పేదవారికి ఇల్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

కేశంపేట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన లిక్కి వెంకటయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ రమణగౌడ్‌లు చెరో రూ.5వేలు సమకూర్చారు. వారి అనుచరులు మృతుడి కుటుంబానికి నగదు అందించి సానుభూతిని తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు అనసూయమ్మ, సురేందర్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీశైలం, యాదయ్య, ఆంజనేయులు, శీను తదితరులు పాల్గొన్నారు.

హన్మంత్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య
- రూ.3 లక్షలు వెచ్చించి స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయించిన మాజీ సర్పంచ్‌కు అభినందనలు

చేవెళ్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామ అభివృద్ధికి సొంత డబ్బు వెచ్చించి స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేసిన మాజీ సర్పంచ్ హన్మంత్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని కమ్మెట గ్రామ మాజీ సర్పంచ్ పట్లోళ్ల హన్మంత్‌రెడ్డి తన సొంత నిధులు రూ.3 లక్షలతో గొల్లగూడ గ్రామం గేట్ నుంచి కమ్మెట గ్రామం వరకు నూతనంగా ఏర్పాటు చేసిన స్తంభాలు, వైర్, లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఎలాంటి రాజకీయ స్వార్థం లేకుండా కమ్మెట గ్రామ ప్రజల కోసం హన్మంత్‌రెడ్డి సొంత డబ్బు వెచ్చించి స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. హన్మంత్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మాజీ ఎంపీటీసీలు జంగయ్య, నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ తుల సీరాజు, నాయకులు సురేందర్‌గౌడ్, అంతయ్య, ఆంజనేయులు, శశిధర్‌గౌడ్, గోపాల్, శ్రీపాల్, దశరథ్, సతీష్, నర్సింలు, సత్యనారాయణ, బాలకృష్ణ, పాండురంగారెడ్డి, రాంచంద్రయ్య గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



కమ్మెట గ్రామంలో స్ట్రీట్‌లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే యాదయ్య

మెరుగైన వసతుల కల్పనే ధ్యేయం : ఎంపీ

ఆమనగల్లు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రూ.10 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు గురువారం రాత్రి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డితో కలిసి ఎంపీ మల్లురవి శంకుస్థాపన చేశారు. మేడిగడ్డ తండాలో నూతనంగా నిర్మించే గ్రంథాలయ భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీ రవి మాట్లాడుతూ ఆమనగల్లు, కల్వకుర్తి మున్సిపాలిటీల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా రూ.30కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. పీసీసీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సీ ఐ జానకిరామ్‌రెడ్డి, ఎస్సై వెంకటేశ్, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ కేశవులు, మాజీ ఎంపీపీ అనితా విజయ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా నాయకుడు మండ్లీ రాములు, జగన్, మానయ్య, తదితరులున్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ మల్లు రవి

ఆడబిడ్డలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని ఆడ బిడ్డలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. కొత్తూర్ మండలంలోని 32 మంది, నందిగామ మండలంలో 22 మందికి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ప్రతీ ఆడబిడ్డ పెళ్లికి ప్రభుత్వం ఆర్థికంగా సాయపడుతోందన్నారు. మహిళలు ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణించాలని సూచించారు. ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యాన్ని కొనసాగిస్తుందని గుర్తుచేశారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలశాఖ అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహయాదవ్, జనిగే జగన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఆమనగల్లు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పత్తి పంటను కాపాడుకోవడానికి రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి పెద్ది శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. పత్తి పంటలో మొక్కలు ఎర్రబారి చనిపోవడం జరుగుతున్న నేపథ్యంలో సూక్ష్మపోషకాలను పిచికారీ చేయాలన్నారు. ఆకుతోటపల్లిలో గురువారం ఏవో పర్యటించారు. పలువురు రైతుల పత్తిపంటను పరిశీలించారు. పురుగు మందుల పిచికారీ వల్ల పంట దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశాలున్న నేపథ్యంలో రైతులు సూక్ష్మ పోషకాలను పిచికారీ చేయాలని సూచించారు.

'డీలక్స్' ప్రయాణికులకు 'నగదు బహుమతి'

- షాద్‌నగర్ ఆర్టీసీ డీఎం ఉష

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27 నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు డీలక్స్ బస్సుల్లో ప్రయాణించేవారికి ఆర్టీసీ నగదు బహుమతులు ఇవ్వబోతున్నదని షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష ప్రకటనలో తెలిపారు. డీలక్స్ బస్సులో టికెట్ తీసుకునే ప్రయాణికులు.. తాము తీసుకున్న టికెట్ వెనకాల పేరు, ఫోన్‌నెంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసే బాక్స్‌లో వేయాలని కోరారు. అక్టోబరు 10న నిర్వహించే లక్కీడ్రాలో మొదటి విజేతకు రూ.20వేలు, రెండవ బహుమతిగా రూ.15వేలు, మూడవ బహుమతి కింద రూ.10వేల నగదు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దసరాను దృష్టిలో పెట్టుకొని ఈనెల 27 నుంచి అక్టోబరు 6 వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడవనున్నట్లు డీఎం వెల్లడించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కందుకూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలంలో అంటు వ్యాధులను ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చెత్తాచెదారంను తొలగించారు. నాయకులు కృష్ణగౌడ్, మల్లారెడ్డి, లక్ష్మణ్ ముదిరాజ్, పున్న భిక్షపతి, రాజేందర్‌రెడ్డి, ఎం.వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, రఘునందన్, ఎస్.వెంకటేష్, మల్లేష్, సుధాకర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, సత్యంగౌడ్, వరుణ్, యాదగిరి, మైసయ్య, జంగయ్య, అనంత్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : పీహెచ్‌సీ ఆవరణలో నాయకులతో కలిసి శుభ్రం చేస్తున్న నర్సింహారెడ్డి

ఉత్సాహంగా 'స్వచ్ఛతా హీ సేవ'

కేశంపేట : మండలంలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఎంపీవో కిష్టయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నిఖిత, మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డిలు పీహెచ్‌సీ ఆవరణలో చెత్తా తొలిగించారు. కొత్తపేటలో మాజీ ఎంపీటీసీ మల్లేష్ యాదవ్, సర్పంచ్ కమ్లేకర్ నవీన్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ నరేష్ యాదవ్, జగదీశ్వర్, సాయిలు, పాలాది శ్రీనివాస్, శ్రీధర్, సంతాపూర్‌లో మాజీ సర్పంచ్ అంజయ్య, కార్యదర్శి శివ, బీజేపీ జిల్లా సాంస్కృతిక శాఖ కో-కన్వీనర్ నరేందర్‌రెడ్డిలు ఆయా గ్రామాల్లో చెత్తాచెదారం తొలిగించారు. పాఠశాలల ఆవరణను శుభ్రం చేశారు.

క్రైం కార్నర్

అల్యూమినియం వైర్లు అపహరణ

- ముగ్గురి అరెస్ట్.. రిమాండ్.. కారు, సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం

కడ్తాల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వెంచర్లలో అల్యూమినియం వైర్ల చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కడ్తాల పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో సీఐ గంగాధర్ వివరాలు వెల్లడించారు. కడ్తాల మండలం కర్కల్‌పహాడ్ నైపుణ్య వెంచర్, ముచ్చర్ల ఎస్వీ హైసిటీ వెంచర్, కడ్తాల టోల్‌గేట్ వద్ద వెంచర్, ఆమనగల్లు మండలం చెన్నపల్లి వద్ద గల వెంచర్‌లో గుర్తుతెలియని వ్యక్తులు కరెంటు స్తంభాలకు ఉన్న అల్యూమినియం వైర్లను రాత్రివేళల్లో కట్ చేసుకొని దొంగిలించుకుపోయారు. వెంచర్ల నిర్వాహకుల ఫిర్యాదుతో పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన సత్యం చౌబే, ధీరజ్ కుమార్, ఒడిషాకు చెందిన జనరోహన్, బిహార్‌కు చెందిన శ్యామ్ బాబులుగా గుర్తించి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి కారు, సెల్‌ఫోన్లు, రూ.40వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసులు చాకచక్యంగా ఛేదించిన ఎస్సైలు వరప్రసాద్, చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది రామకోటి, రాజశేఖర్‌లను సీఐ గంగాధర్ అభినందించారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

చౌదరిగూడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణానికి చెందిన ధనుంజయ రెడ్డి (56) జిల్లేడ్ చౌదరిగూడ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. నాలుగేళ్లుగా పక్షవాతంతో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ విధులకు హాజరవుతున్నాడు. గురువారం షాద్‌నగర్‌లోని ఇంటి వద్ద గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు.



ధనుంజయరెడ్డి(ఫైల్)

కిలో గంజాయి స్వాధీనం.. నిందితుడి రిమాండ్

మంచాల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వాహన తనిఖీల్లో భాగంగా గంజాయి పట్టుబడినట్లు సీఐ మధు చెప్పారు. ఆగాపల్లి-నాగార్జునసాగర్ రహదారిపై గురువారం ఉదయం 10గంటల సమయంలో బస్టాప్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. ఓ బ్యాగుతో వ్యక్తి అనుమానస్పదంగా తిరగడాన్ని గమనించి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి పేరు ప్రమోద్‌కుమార్ అని ఇతను ఛత్తీస్‌ఘడ్‌లోని డోంగర్‌వాన్ ప్రాంతానికి చెందిన వాడిగా తెలిపారు. కేసు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు ఘన నివాళి

కందుకూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల గుండెల్లో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిరస్థాయిగా నిలిచిపోతారని ఆయన వీరాభిమాని బాలమల్లేష్ యాదవ్ అన్నారు. గురువారం ఎస్పీబీ 5వ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన వర్ధంతి సభకు ఆయన హాజరయ్యారు. గుండ్ర సుధాకర్‌రెడ్డి, పి.సాంబశివరావు, నీలం శ్రీరాములు, తదితరులు ఉన్నారు.



ఎస్పీబీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాలమల్లేష్ తదితరులు

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

మొయినాబాద్ రూరల్/షాబాద్, సెప్టెంబరు 25(ఆంధ్యజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో గల ఆయన ఇంట్లో చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం ఆయన అందజేశారు. రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, మండలాధ్యక్షుడు మాణయ్య, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు బాలకృష్ణారెడ్డి, బొలిగిద్ద సత్యనారాయణ, గన్నెపాగ నర్సింగ్‌రావు, లీగల్‌సెల్ మండలాధ్యక్షుడు బైకని కుమార్‌యాదవ్ తదితరులున్నారు. కాగా, భీంభరత్ పేరుమీద తన అభిమాని రూపొందించిన పాటల సీడీని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. పార్టీ షాబాద్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు నర్సింహులు, చెన్నయ్య, నాయకులు పెంటారెడ్డి, యాదయ్య, వెంకటయ్య, సత్యనారాయణ, బాలకృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



షాబాద్ : సీడీని ఆవిష్కరిస్తున్న భీంభరత్

ఆమనగల్లులో నటి హరితేజ సందడి

ఆమనగల్లు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో గురువారం నటి, యాంకర్ హరితేజ సందడి చేసింది. ఆమనగల్లు పట్టణానికి చెందిన కొల్లూరి మహేశ్ నిఖిత దంపతులు స్వయం ఉపాధిలో భాగంగా స్థానిక బస్టాండ్ ఎదుట ఏర్పాటు చేసుకున్న నందిని మొబైల్‌షాపు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, స్థానిక నాయకులతో కలిసి దుకాణాన్ని ప్రారంభించారు. సీఐ జానకిరామ్‌రెడ్డి, ఎస్సై వెంకటేష్, వివిధ పార్టీల నాయకులు, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



షాపును ప్రారంభిస్తున్న నటి హరితేజ

దుర్గామాత ఉత్సవాలకు నటి శ్యామలకు ఆహ్వానం

కడ్తాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లిలో యువ నాయకుడు మహేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో దుర్గమాత బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం హైదరాబాద్‌లో సినీ నటి శ్యామలను ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. శేఖర్‌యాదవ్, సురేశ్, వెంకీ, బన్నీ తదితరులు ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

చేవెళ్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దసరా బ్రహ్మోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారి ఆలయం గోవింద నామస్మరణతో మార్మోగుతోంది. బుధవారం రాత్రి 7 గంటలకు వేంకటేశ్వర స్వామి వారు హంస వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. ధర్మకర్తలు దేవుని వామనాచార్యులు, భక్తులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.



స్వామివారి ఊరేగింపులో భక్తులు

ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం

కడ్తాల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో ముందుకుసాగేవారు ఆనందమయ జీవితం పొందుతారని ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ గీతానర్సింహ, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీ పాతి శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. మైసిగండి మైసమ్మ ఆలయాన్ని గురువారం దర్శించుకొని పూజలు చేశారు. షాబొద్దీన్, బాల్‌రాజ్, అర్చకుడు యాదగిరిగౌడ్ ఉన్నారు.



పూజలో గీతా నర్సింహ

సామాజిక తనిఖీపై నేడు ప్రజా వేదిక

కేశంపేట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై నేడు(శుక్రవారం) ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు మండలంలో చేసిన పనులపై ఈనెల 16నుంచి 25వరకు క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ బృందం వివరాలు సేకరించిందన్నారు.

కొత్తూర్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా నర్సయ్య

కొత్తూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా జి.నర్సయ్యను నియమిస్తూ సైబరాబాద్ కమిషనరేట్ నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. షాద్‌నగర్ రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న నర్సయ్య కొత్తూర్‌కు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న నర్సింహారావు జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సర్దార్‌నగర్ ఉన్నత పాఠశాలకు చెందిన 1983-84 బ్యాచ్ టెన్త్ క్లాస్ విద్యార్థులు గురువారం సమ్మేళనాన్ని నిర్వహించారు. షాద్‌నగర్ మల్లిఖార్జున బాంకెట్‌హాలులో సమావేశమై.. వారికి పాఠాలు బోధించిన గురువులు రాంరెడ్డి, వీరస్వామి, లక్ష్మారెడ్డి, అడివప్పలను సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. పూర్వ విద్యార్థులు వెంకట్‌రాంరెడ్డి, మునగపాటి నర్సింహులు, గుబ్బ మదన్‌మోహన్‌గుప్త, అనిల్ కుమార్, నర్సింహాచారి, సురేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, భాస్, రేణుక, మీరాబాయి తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో 1983-84 బ్యాచ్ విద్యార్థులు

కొత్త కిక్కు!

(ఐదో పేజీ తరువాయి)

ఉండగా.. 9 గౌడ, 6 ఎస్సీ, మిగతా 96 జనరల్‌కు కేటాయించారు. అలాగే సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరిధిలో 138 మద్యం షాపులు ఉండగా.. అందులో 25 గౌడ, 11 ఎస్సీ, 2 ఎస్టీలకు కేటాయించారు. మిగతా 100 మద్యం షాపులు జనరల్‌కు కేటాయించారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ దరఖాస్తుదారులు కుల, ధ్రువీకరణ తప్పనిసరి చేశారు.

భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం?

ఈ సారి టెండర్ ఫీజు పెంచినా పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వ్యాపార లాభాలు ఎక్కువగా ఉండటంతో పాటు మద్యం విక్రయాల ద్వారా స్థిరమైన ఆదాయం వస్తుందని భావించే వారిలో ఆసక్తి అధికంగా ఉంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలతో పాటు చిన్న పట్టణాలు, గ్రామాల్లో కొత్త దుకాణాలపై ఆసక్తి పెరిగినట్లు తెలుస్తోంది. అదే విధంగా రిజర్వేషన్లు ఉండటం వల్ల వెనుకబడిన వర్గాలకు అవకాశం లభిస్తోంది. ఇది కూడా పోటీని మరింత పెంచుతున్న అంశంగా కనిపిస్తోంది. ప్రభుత్వం కొత్త లైసెన్సుల ద్వారా ఆదాయం పెంచుకోవడంతో పాటు పారదర్శకతను కాపాడే విధానాన్ని అనుసరిస్తోంది. ఈ కారణంగా దరఖాస్తుదారుల సంఖ్య మరింత అధికమయ్యే అకాశం ఉందని పరిశీలకులు పేర్కొంటున్నారు. గత మద్యం పాలసీలో శంషాబాద్ సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరిధిలో మొత్తం 21,615 దరఖాస్తులు స్వీకరించారు. వైన్‌షాపుల దరఖాస్తులతో రూ.432.30 కోట్ల ఆదాయం సమకూరింది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో మద్యం దుకాణాలకు పోటీ ఎక్కువగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో వైన్‌షాపుల దరఖాస్తుల ఫీజుల రూపంలో పెద్ద మొత్తంలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.

ఘనంగా దీన్‌దయాల్ జయంతి

పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన్ను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.



షాద్‌నగర్ అర్బన్ : నివాళులర్పిస్తున్న నాయకులు



కందుకూరు : మండల కేంద్రంలో మొక్కలు నాటుతున్న నర్సింహారెడ్డి, కృష్ణగౌడ్, రాజేందర్‌రెడ్డి



కొత్తూర్ : నివాళులర్పిస్తున్న నాయకులు



కొందుర్గు : దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, చిన్నారులు



ఇబ్రహీంపట్నం : కప్పాడులోని వేంకటేశ్వరాలయం ఆవరణను శుభ్రం చేస్తున్న నాయకులు